# 'స్వార్థం కోరిన బలి'



'వాచస్పతి'

తెల తెల వారుతూంది. మసక చీకటి జిలుగు తెరను తొలగించి మధుర మందహాసాన్ని చిగురిస్తోంది ఉషఃకాంత. దూరంగా స్వామి కోవెల అసంఖ్యాక విద్యుద్దీపాలతో దేదీప్యమానంగా, శోభాయమానంగా వెలిగిపోతుంది. గంటలు మ్రోగుతున్నాయి. భక్తులు సాగిపోతున్నారు. స్వామి దర్శనానికి.

వల్లి కిటికీ నుండి దూరంగా చూసింది.

పడమట దిశ చంద్రుడు తెల్లగా పాలిపోయి ఉన్నాడు.

రాత్రంతా సరిగ్గా నిద్రలేకపోవడం వల్ల, కన్నీరు కార్చడం వల్ల ఆమె కళ్ళు ఎర్రబడి వున్నాయి. ఎర్రని ఆమె కళ్ళల్లో ఒక విధమైన అశాంతి చోటు చేసుకుని ఉంది. ముఖంలో విచారం గూడుకట్టుకుని ఉంది. గుండెలో బాధ పేరుకుని ఉంది.

అరగంట క్రితం వల్లి తల్లీ తండ్రీ, తమ్ముడు అంతా కలిసి ఆలయానికి వెళ్ళారు.

అప్పటి నుండి అలాగే కిటికీదగ్గర నిల్చుని ఉంది వల్లి.

ఇక నిలువోలేక వచ్చి పడకమీద వాలిపోయింది.

ఏవేవో ఆలోచనలు.....దూరంగా నెట్టాలను కున్నా ఆమెను వదలిపోవడం లేదు.

జీవితంలో తనకిక శాంతి లభిస్తుందా ?

పదే పదే ఆ ప్రశ్న ఆమెను వేధించ సాగింది.

తన శ్రీధర్ తనకు తిరిగి కనిపించిన రోజు తనకు శాంతి లభిస్తుంది. ఆనాడే తన బ్రతుకులో పున్నమి పరిమళిస్తుంది.

ఊహూ... ఇది అసంభవం... కాదు... సంభవమే...

శ్రీధర్ పై చదువులో అమెరికా వెళ్ళి దగ్గర దగ్గర ఒకటిన్నర సంవత్సరం కావొస్తుంది. శ్రీధర్ వెళ్ళిన ఆరు నెలలవరకూ క్రమంగా తనకు ఉత్తరాలు వచ్చాయి. తర్వాత ఒక ఉత్తరమూ లేదు.

అంతే. సంవత్సరంగా అతని విషయం తనకు తెలియదు. అలాంటిది ఇకమీదట ఏం తెలుస్తుంది ?

శ్రీధర్ తనను మరచిపోయాడా ? క్షేమంగా ఉన్నాడా ? సజీవంగా వున్నాడా ?

ఆ ఆలోచనతో నిలువెల్లా వణికిపోయింది. గుండె దడదడలాడింది. కళ్ళల్లో నీరు గిర్రున తిరిగింది.

కొద్ది క్షణాలు గాని, తన్ను తాను సంభాళించుకోలేకపోయింది. కనుకొనకుల్లో నిలచిన నీటిని మెల్లగా పైట చెరగుతో వొత్తుకుంది.

ఆమె మనసంతా శ్రీధర్‌ను గురించిన ఆలోచనలతో నిండిపోయింది.

నాలుగు సంవత్సరాల వెనక్కు వెళ్ళింది మనసు.

తనప్పుడు బి. యస్. సి. ఫైనలియర్‌లో ఉంది. అప్పుడే శ్రీధర్ వాళ్ళతో పరిచయమైంది. తామొక పెద్ద ఇంటిలోని చిన్నవాటాలో అద్దెకుంటున్నారు. తమ ప్రక్క వాటాలో ఉంటున్న వారికి ట్రాన్స్‌ఫర్ కావడంతో శ్రీధర్ వాళ్ళు ఆ వాటాలోకి వచ్చారు.

శ్రీధర్, శ్రీధర్ బామ్మ ఇద్దరు ఆ యింట్లో ఉండేవారు. వాళ్ళ స్వగ్రామం హైద్రాబాద్ దగ్గర చిన్నపల్లె. జీవనానికి సరిపడేటట్లు కొద్ది పాటి ఆస్తిపాస్తులువున్నవాళ్ళే. ఇంటిదగ్గరనుండి పప్పూ, ఉప్పూ, బియ్యం తెచ్చుకుని వండుకుని తిని గుట్టుగా కాలక్షేపం చేసేవారు. ముందున్న ఇంటి అద్దె మరీ ఎక్కువ కావడంవల్ల ఆ ఇల్లు వదలి ఈ చిన్న వాటాలో చేరినట్లు చెప్పారు బామ్మగారు

ఆడవాళ్ళకు పరిచయమూ, స్నేహమూ చాలా తొందరగా కుదురుతాయి. చేరిన మరునాడే అమ్మతో మాటలు కలిపారు బామ్మగారు. వారం రోజులకల్లా ఆ ఇంటికీ, ఈ ఇంటికీ మధ్య రాకపోకలు ఏర్పడ్డాయి. నెలతిరిగేసరికల్లా అమ్మకూ, బామ్మకూ మంచి స్నేహం ఏర్పడింది. బామ్మగారు అప్పుడప్పుడూ తాను వండిన కూరలు తెచ్చి ఇచ్చేది అమ్మను రుచి చూడమంటూ. నెలకో రెండు నెలలకో శ్రీధర్ నాన్నగారొచ్చి వాళ్ళ యోగక్షేమాలు విచారించి వెళ్ళేవారు.

శ్రీధర్ అప్పుడు ఎమ్.ఎస్.సి. ప్రీవియస్‌లో ఉండేవాడు. పి. యు. సి. లో ఉండగా అతనికి అమ్మవారు పోసిందట. అప్పటినుండి కారం అతని తత్వానికి పడకుండా వచ్చిందట. దాంతో బామ్మగారు వచ్చి మనవడికి వండిపెట్ట సాగారు.

కొన్ని నెలలు జరిగాయి. ప్రక్క-ప్రక్క వాటాలలో ఉంటున్నందువల్ల అప్పుడప్పుడూ తామిద్దరూ ఒకరినొకరు చూసుకోవడం జరిగేది. సభ్యతతో కూడిన పలకరింపులుకూడా తమ మధ్య జరగలేదు. అతను యూనివర్సిటీ నుండి రాగానే పుస్తకాలు ముందు వేసుకునే వాడు. తనూ అంతే! అమ్మకో గంటసేపు ఇంటిపనిలో సాయంచేసి, మిగతా సమయమంతా పుస్తక పఠనంలోనే గడిపేది. క్లాసు బుక్స్ చదవటం విసుగనిపించినప్పుడు జనరల్ బుక్స్, మేగజైన్స్ చదువుకునేది.

ఆరు నెలలు తిరిగేసరికల్లా ఆ పెద్దయింట్లో చిన్నచిన్న వాటాలలోఉన్న పెద్దాచిన్నా అంద

నుండీ "బుద్ధిమంతుడు" అన్నసర్టిఫికేటు సంపాదించుకున్నాడు శ్రీధర్. అందరితోపాటు తనూ ఓ సర్టిఫికేట్ ఇచ్చింది.

ఆరునెలల పరీక్షలు దగ్గరకొచ్చాయి. ఆసమయంలోనే ఇంటిదగ్గర శ్రీధర్ తల్లికి బాగాలేదనీ, బామ్మగారిని ఇంటికి రమ్మనీ ఉత్తరం వచ్చింది. తన మనవడు స్టవ్ మీద వంటచేసుకుంటాడనీ హోటల్ కూరలు మకీకారంగా ఉంటాయి గనక కారంలేకుండా కూరలు చేసిపెట్టమని అమ్మకు చెప్పి, కూరగాయలకు కొద్దిగా డబ్బుకూడా ఇచ్చి వెళ్ళారు బామ్మగారు.

వారంరోజులు జరిగిపోయాయి. అమ్మరోజూ రెండు పూటలా కూరలు తీసికెళ్ళి ఇచ్చేది. ఓ రోజు అమ్మ సినిమాకెళ్తూ ఆ పని తన కప్పచెప్పి వెళ్ళింది. తనా విషయం పూర్తిగా మరచిపోయి ఉదయం జరగబోయే పరీక్షకుచదువుకోసాగింది ఎనిమిదిన్నరకు పుస్తకంమూసి అన్నం తిందామని లేచింది. అప్పుడు గుర్తొచ్చింది, శ్రీధర్‌కు కూర ఇవ్వలేదన్న విషయం!

"అడిగి తీసుకుంటేనేం?" అనుకుంది చికాగ్గా.

కూరగిన్నె తీసికెళ్ళి ఓరగా వేసివున్న తలుపు నెట్టింది.

అప్పుడే అన్నం తినడం పూర్తయింది కాబోలు, కంచంలో చెయ్యికడుగుతున్నాడు శ్రీధర్!

"దేంతో తిన్నారు, అన్నం?" అతనివేపు ఎగాదిగా చూస్తూ సాశ్చర్యంగా అడిగింది.

"మజ్జిగతో!" సన్నగా నవ్వుతూ టవలుతో చెయ్యి తుడుచుకుంటూ అన్నాడు.

"అమ్మ కూర ఇవ్వమంది. నేనే మరచిపోయాను" నొచ్చుకుంటూ అంది. "ఫర్వాలేదు. ఇంతవరకు చదువుకుంటున్నారుకాబోలు? ఇప్పటివరకూ జరిగిన పరీక్షల్లో బాగా వ్రాశారా?" అన్నాడు తన ముఖంలోకి చూస్తూ.

అతనలా తన ముఖంలోకి పరీక్షగా, నెమ్మదిగా చూడటం అదే మొదటిసారనిపించింది తనకు.

కళ్ళు మెల్లగా వాల్చుకుంటూ "బాగా నే వ్రాశాను" అంది.

"అవ్వ మీ పేరేమిటో చెప్పింది. అసలు మీ పేరేమిటి?" అడిగాడు కుతూహలంగా.

"వల్లవి!"

"చాలా చక్కని పేరు! మీకు తగిన పేరునే ఎన్నుకుని పెట్టారు మీవాళ్ళు!"

"మా నాన్నగారు వెదకి వెదకి, ఆ పేరు పెట్టారట నాకు" అంది సగర్వంగా తను.

"అలాగా! మిమ్మలను నిలుచోబెట్టే మాట్లాడుతున్నాను. కూర్చునేందుకేమన్నా అభ్యంతరమా?" నిశ్చలంగా తన కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు.

"అభ్యంతరం ఏం లేదు, చదవవలసింది ఇంకా బోలెడుంది. వెళ్తాను. ఈ పూట మీరు ఉత్త మజ్జిగన్నం తినేటట్లు చేశాను."

"ఫర్వాలేదు. ఒక్కపూట మజ్జిగన్నం తిన్నంత మాత్రాన మునిగిపోయేదేమీ లేదు రెండు పూటలా మజ్జిగన్నమే తిని ఉండగలను. కానీ అవ్వ నన్నలా ఉండనివ్వలేదు. మీకు లేనిపోని శ్రమ కల్పించి మరీ వెళ్ళింది."

"నాకేం శ్రమ లేదు."

"మీకు కాదు: మీ అమ్మగారికి."

"అమ్మ అలా ఎప్పటికీ అనుకోదు. అలా అనుకునే పక్షంలో బామ్మగారలా చెప్పే ఉండరు" తల అడ్డంగా తిప్పుతూ అంది తను.

అతను మెల్లగా నవ్వాడు.

తను వచ్చేసింది.

అమ్మ సినిమానుండి రాగానే జరిగిన విషయం చెప్పింది.

తన నిర్లక్ష్యానికి అమ్మ నొచ్చుకుంది.

తర్వాత కనిపించినప్పుడల్లా సన్నని చిరునవ్వు చిలికించేవాడు శ్రీధర్! అది కేవలం స్నేహపు జల్లు మాత్రమే అనిపించేది తనకు

సమయమూ, అవకాశమూ ఉంటే "బాగున్నారా!" అని మాటకు పలకరించి ముందుకు సాగిపోయేవాడు.

శ్రీధర్ తన మంచితనం అనే బీజాన్ని తన హృదయంలో నాటి సహృదయపు అమృతపు ధారలను చిలికించి ఆ బీజానికో రూపాన్నిచ్చి, నెమ్మదిగా పెంచి పెద్దచేస్తూ వచ్చాడు. అతనంటే చాలా మంచి అభిప్రాయం ఏర్పడింది తనకు.

ఆ సంవత్సరం నెమ్మదిగా జరిగిపోయింది.

సాంవత్సరిక పరీక్షలు జరిగాక, బామ్మగారు శ్రీధర్ వాళ్ళ ఊరెళ్ళారు వాళ్ళ రిక్షాలో సామాను సర్దుకుంటుంటే, స్నేహితురాలింటికి వెళ్ళిన తను ఎదురు వచ్చింది.

"పల్లెకు వెళ్తున్నామమ్మా, వల్లవి!" అన్నారు బామ్మగారు.

"మంచిది. వెళ్ళిరండి!"

శ్రీధర్ ఏం మాట్లాడలేదు, రిక్షా దగ్గర నిలుచుని తనవేపే చూస్తున్నాడు. ఏవో చెప్పాలని అతను ప్రయత్నించినట్లు తనకనిపించింది.

కానీ, ఒకమాట మాట్లాడలేదు.

కానీ, ఆ చూపులే మాట్లాడినట్లనిపించింది తనకు.

'ఒక్కమాట మాట్లాడ్తే ఏం?' ఆమెకు ఉక్రోషం కలిగింది.

'ఉత్త పిరికివాడు! మూగవాడు!" అనుకుంది కసిగా.



"పాము పామని దాన్ని చూసి ఝడుసుకున్నావు వెర్రివాడా! కుర్రవాడా!"

'కాదు. చాలా మంచివాడు, సభ్యతా, సంస్కారమూ తెలిసినవాడు.' అని గుసగుస లాడింది ఎద.

ఆ సెలవులు చాలాహాయిగా గడచినట్లనిపించింది, ఎందుకంటే శ్రీధర్‌కు సంబంధించిన ఊహలే సెలవు రోజులకు ఓ విధమైన హాయి, తీయదనాన్ని కలిగించాయి.

"అతడు తనవాడవుతాడా?" అన్న ప్రశ్న ఉదయించేది అప్పుడప్పుడూ. "అతనికి తనకూ మధ్య అలాంటి బంధం ఉందా అసలు?" అన్న అనుమానం కలిగేది మరుక్షణం.

అలాంటి పిచ్చి ఊహలకు నవ్వుకునేది.

రోజులు జరిగిపోతున్నాయి. పరీక్షా ఫలితాలు తెలిశాయి. తను ఫస్టు క్లాస్‌లో పాసయింది, ఎమ్. యస్‌ సి. లో చేరాలనే కోరికను నాన్న దగ్గర వెలిబుచ్చింది. ఆ సమ్మర్‌లోనే ఎల్. టి అసిస్టెంట్‌గా హైస్కూల్లో పనిచేస్తున్ననాన్న రిటైర్ అయ్యారు. తమకు అప్పులులేవు ఆస్తి లేదు. నాన్న తాను సంపాదించిన దాంతోటే ముగ్గురక్కలకు పెళ్ళిళ్ళు చేశారు. అవసరాలకు అప్పుడప్పుడూ, ప్రావిడెంటుఫండునుండీ, ఇన్సూరెన్సునుండి తీసుకున్న అప్పులకుపోనూ. కొన్ని వేలుమటుకే చేతికందాయి. తన కోరికను నాన్న కాదనలేదు. డబ్బుఅయిపోతుంది వద్దని అమ్మ వారిస్తున్నా, నాన్న తనను ఎమ్. యస్. సి లో చేర్పించారు.

ఇప్పుడు శ్రీధర్‌ను యూనివర్సిటీలోకూడా తరచు చూస్తుంది.

తామిద్దరి మధ్య కొద్దిగా స్నేహం ఏర్పడినా, మాట్లాడుకోవడం మటుకు తక్కువే.

ఆసారి దసరా సెలవుల్లో అతిసార విరేచనాలు వచ్చి బామ్మగారు పరమపదించారు. సెలవులకు మనవడితో సలక్షణంగా వెళ్ళిన బామ్మగారు మళ్ళీ సెలవులయ్యాక తిరిగి రాకపోవడం తనకు చాలా బాధను కలిగించింది. ఒంటరిగా వచ్చిన శ్రీధర్‌ను చూడగానే తన గుండె నీరయింది. అమ్మా, నాన్నా కూడా ఊళ్ళోలేరు. అక్క ప్రసవం కష్టమై హాస్పిటల్లో ఉందని టెలిగ్రాం రావడం వల్ల వెళ్ళారు. పరిస్థితి ఎలా ఉందీ చూసుకుని ఉత్తరం వ్రాస్తామనీ, అవసరమని వ్రాస్తే తననూ, మురళినీ రమ్మనిచెప్పి వెళ్ళారు.

విచారంలో ఉన్న శ్రీధర్‌ను పలకరించి రావడం భావ్యమనిపించింది. కానీ అలా వెళ్ళి ఆతణ్ణి పలకరించడం బాగుండదని కాసేపు వెళ్ళేందుకు సందేహించింది.

ఉదయం వచ్చారు అతను. సాయంత్రం అవుతుంది. ఏమన్నా తిన్నాడో లేదో అతని స్నేహాన్ని మనసు కోరుతుంది. ధైర్యంచేసి వెళ్ళింది. మంచం మీద పడుకుని ఇంటికప్పు కేసి చూస్తు ఏదో ఆలోచిస్తున్నాడు. తన పాదాల చప్పుడుకు చూపులు త్రిప్పిచూశాడు. వెంటనే మంచం మీదనుండి లేచి "మీరా! రండి!" అన్నాడు.

"బామ్మగారు పోయారట? ఇల్లు గలావిడ చెప్పారు?"

"అవును" చూపులు వాల్చుకుని విషాద స్వరంతో అన్నాడు.

"పెద్దామె. ఆమెకొరకు విచారించవలసిన పనిలేదు" పెద్దతరహాగా ఓదార్చబోయింది!

అదో రకంగా నవ్వాడు.

తర్వాత ఏం మాట్లాడాలో తనకు తోచలేదు. మౌనంగా కూచుని, ఓరగా అప్పుడప్పుడూ అతని వేపు చూడసాగింది.

నాలుగయిదు రోజులుగా గడ్డం చేసుకున్నట్లు లేదు. ముఖంలో అలసటా, విచారం బాగా కనిపిస్తున్నాయి. మధ్యాహ్నం భోంచేసినట్లులేదు. జాలితో తనగుండె నిండిపోయింది. గుండెలో తనకే తెలియక గుప్తంగా దాగిఉన్న అనురాగ స్రవంతి, ఇక దాగలేనంటూ పైకి పొంగింది.

"మధ్యాహ్నం భోంచేశారా?" తప్త కంఠంతో అంది.

చూపులు వాల్చుకున్నాడు అపరాధిలా.

"రాత్రికి వంటచేస్తాను. భోజనానికిరండి!"

"మీకెందుకు శ్రమ?"

"శ్రమా? మీకెలా చెప్పాలో తెలియడంలేదు శ్రీధర్!" అంది చలిత స్వరంతో.

అతను విస్ఫారిత నేత్రాలతో తనవేపు చూస్తుండిపోయాడు కొద్దిక్షణాలు.

అతని కళ్ళల్లో ఏదో మెరుపు తనకు కనిపించింది.

తన ముఖంలోకి వెచ్చని నెత్తురు ఉబికింది.

గబగబా అక్క[illegible]డి వచ్చేసింది తను.

ఏడున్నరకల్లా వంటపూర్తిచేసి అతని రాక కొరకు ఎదురుచూడసాగింది. వస్తాడో రాడోనన్న సందేహం ఓప్రక్క పీడించుతూనే ఉంది.

ఎనిమిది గంటలకు వచ్చాడు.

"వస్తారో రారో అనుకున్నాను."అంటూ తన సందేహాన్ని వెలిబుచ్చింది.

"రానని ఎందుకనుకున్నారు?" నా మనసు తెలిసికోకుండానే సాయంత్రం అలా ప్రవర్తించారంటే నేను నమ్మను."

"అదికాదు."

"ఏదికాదు? మురళీవీడి?" అంటూ మాట మార్చాడు.

"ఏ తొమ్మిదింటికోగానీ ఇల్లు చేరుకోడు. మీలా బుద్ధిగా ఇంట్లోకూర్చుని చదువుకునే మొగపిల్లలు ఈ కాలంలో చాలా తక్కువ!"

మృదువుగా నవ్వాడు.

షేవ్‌చేసుకుని, నీట్‌గా తయారయి వచ్చాడు. పొడవుగా, తెల్లగా, ఆకర్షణీయంగా ఉన్నాడు.

దగ్గరుండి కొసరి కొసరి వడ్డించినా సరిగ్గా తినలేదు.

"కూరలు రుచిగా లేవా?"

"చాలా బాగున్నాయి!"

"మరయితే చాలాకొద్దిగా అన్నంతిన్నారేం?"

"సంతోషంతోనే కడుపు నిండిపోయింది!"

"ఏమిటంత సంతోషం?"

"చెబుతాను. ముందు నాప్రశ్నకు సమాధానం చెప్పండి! నేనంటే మీకెందుకింత అభిమానం?"

"తెలీదు" చూపులు త్రిప్పుకుని అంది.

"తెలియక కాదు; చెప్పడం ఇష్టంలేక"

"కాదు; చెప్పడం చేతగాక! ఎలా చెప్పాలో తెలియక!" లజ్జా సంకోచాలతో ముడుచుకు పోతూ అంది.

"పల్లవీ! నా సంతోషానికి కారణం ఇప్పటి కన్నా తెలిసిందా?"

తనకు దగ్గరగా వచ్చి, గడ్డం మునివేళ్ళతో ఎత్తి తన కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు.

తను చూపులు వాల్చుకుంది బుగ్గల్లో మందారాలు విరిసినట్లు ఊహించింది.

"నువ్వెంత మంచిదానవు! ఎంత చక్కని దానవు! ఎంత అందమైన పేరు పెట్టుకున్నావు. ఎన్నిసార్లు పిలిచినా పిలవాలనే అనిపిస్తుంది!" తన్మయంగా, అరమోడ్పు కన్నులతో అన్నాడు.

"పేరుకేం? ఎన్నిసార్లయినా పిలుచుకో వచ్చు; రేషనేమీ లేదు!"

"ఊరకే పిలుస్తుంటే పిచ్చివాడిననుకోవూ?"

కిలకిలా నవ్వి అంది.

"శ్రీధర్! ఎన్నాళ్ళకు నీకు దగ్గరగా రాగలిగాను! అబ్బ! యుగాల నిరీక్షణలా ఉంది!"

శ్రీధర్ "అవును పల్లవి! నాకు అలాగే అనిపిస్తుంది" అన్నాడు.

"ఇక మీదట మా ఇంట్లోనే భోంచేయండి!"

"మీ అమ్మ నాన్నా తరిమేస్తారు!"

"ఇంటల్లుడినే తరిమేస్తారా?" క్రీగంట చూస్తూ అంది.

"తాళికట్టనిదే నా నీడకూడా ఈ ఇంటిమీద పడకూడదు! నలుగురి నోళ్ళలో వృధాగా నానడం ఎందుకు?"

"ఇప్పుడేం అనుకోవడం లేదనేనా, మీ ఉద్దేశం?" కిలకిలానవ్వి అంది తను. శ్రీధర్ హాయిగా నవ్వి అన్నాడు "ఈరోజువరకు ఏం అనుకోకున్నా ఇకమీదట అనుకునేందుకు

ఉచితము! ఉచితము!

తెల్లమచ్చలు

మా ఔషధముతో ఏ రకం మచ్చల రంగు గానిమొదలు నుండి 3 దినములలో మారి అటుపైన పూర్తిగా మామూలు చర్మం రంగుకు మారిపోవును. ప్రచారం కొరకు ఒకసీసా మందు ఉచితంగా యిస్తున్నాము. వెంటనే వ్రాయండి. 25

Satyadeo Chikitsha Kendra
Imadpur P O. Khodaganj
(Attasarai) (PATNA)

## గాథావళి - 284

# మూర్ఖత్వానికి, నీచత్వానికి మధ్యన

రిచర్డ్ షెరిడాన్ బ్రిటిష్ మేధావులలో ఒకడు. ఎదుటి వ్యక్తులను దెబ్బతీసే వాక్చాతుర్యంలో ఘటికుడు.

ఒకనా డాయన వీధిలో వెళుతుండగా ఇద్దరు మిత్రులు ఆయనను పలకరించారు. అందులో ఒక పెద్దమనిషి ఇలా అన్నాడు: షెరిడాన్! నీలో మూర్ఖత్వం ఎక్కువ మోతాదులో వుందని నేనూ, నీచత్వం ఎక్కువ మోతాదులో వుందని ఇతగాడు వాదించుకుంటున్నాం. నీ అభిప్రాయం ఏమిటని అడిగాడు.

షెరిడాన్ ఆ యిద్దరి భుజాలమీద చేతులు వేసి నడుస్తూ టక్కున ఇలా సమాధానము ఇచ్చాడు. నేనిప్పుడు మూర్ఖత్వానికి, నీచత్వానికి మధ్యన వున్నానని నా అభిప్రాయం.

బి. అంజిబాబు

వీలుంది "అందుకు మంచి అవకాశం కలిగించానేమో నేను !"

"నలుగురూ ఏమన్నా అనుకుంటారని భయపడుతున్నారా ? అయితే, మిమ్మల్ని భోజనానికి పిలిచి పెద్ద తప్పుచేశాను" ఉద్దేశపూర్వకంగానే అందా మాటలు.

"ఉహూ... నన్నుగురించి మీరు మంచిగా అనుకున్నంతకాలం చెడ్డవాడని లోకం కోడై కూసినా నాకేం భయంలేదు !"

"బడాయి !"

"ఎవరికి ?"

ఇద్దరూ కలిసి హాయిగా నవ్వుకున్నారు.

రోజులు జరిగేకొద్దీ తమ స్నేహబంధం గాఢమైన ప్రేమానుబంధంగా మారి, ఇద్దరినీ బంధించివేసింది.

శ్రీధర్ "వుడ్‌బీ" అంటూ తనను చూపి యూనివర్శిటీలోకూడా చెప్పుకునేంత వరకు వచ్చింది.

అమ్మ కులాంతరమనీ, శ్రీధర్‌తోటి స్నేహం మానుకోమనీ చెప్పింది. పెళ్ళంటూ చేసుకుంటే శ్రీధర్‌నే చేసుకుంటానని గట్టిగా చెప్పడంవల్ల అమ్మ మౌనంగా ఉండిపోయింది. నాన్న మొదటి నుండీ మౌనంగానే ఉన్నాడు. మౌనం అర్ధాంగీకార మనుకుంది తను. అదీగాక, తను శ్రీధర్‌ను చేసుకోవడం పెద్ద తప్పుకాదని ఆయన ఉద్దేశమై ఉంటుంది. తలుపు తట్టిన చప్పుడుకాగా, ఉలికిపడి ఈ లోకంలోకివచ్చిపడింది పల్లవి. చెమ్మగిలిన కళ్ళు తుడుచుకుని వెళ్ళి తలుపు తీసింది. ఆమె తల్లి, తండ్రి, తమ్ముడూ గుడినుండి తిరిగి వచ్చారు.

"మాతో రమ్మంటే రానన్నావు. ఒక్కదానవూ కూచ్చుని ఏం చేస్తున్నావు?"

ఆప్యాయత నిండిన కంఠంతో అంది ఆమె తల్లి.

"చదుకున్నాను"

"ఏమిటో నీదారి నీదే. చెప్పినమాట వినవు" నిట్టూరుస్తూఅంది. ఆమె తమ్ముడు, మురళి కాఫీ తెచ్చేందుకు ఫ్లాస్కు తీసుకుని వెళ్ళాడు.

తల్లి బల్లవంతం మీదలేచి ముఖం కడుక్కుంది.

మళ్ళీ కిటికీ దగ్గర నిలుచుంది పల్లవి.

శ్రీధర్ రూపం, అతని మాటలు, అతనితోటి అనుబంధం పదే పదే గుర్తుకు వస్తున్నాయి ఆమెకు.

తిరిగి గతంలోకి పరుగుతీసింది మనసు.

శ్రీధర్ యమ్. ఎస్. సి లో యూనివర్శిటీ ఫస్టుగా వచ్చాడు. స్టేట్సుకు రిసెర్చికి వెళ్ళేందుకు స్కాలర్‌షిప్ వచ్చింది.

అంతా అతని అదృష్టాన్ని ఆకాశానికి ఎత్తేశారు!

తనకు సంతోషంగానే ఉంది. కానీ, ఓ మూల ఏవో దిగులు. రెండు సంవత్సరాలు శ్రీధర్‌ను చూడకుండా ఉండడం ఎలాగ ? అంతేకాదు. అవ్యక్తమైన భయాలూ, బాధలూ గుండెలో చోటు చేసుకున్నాయి. శ్రీధర్ స్టేట్సుకు వెళ్ళే ముందు, అతని కోరిక ప్రకారం మొదటిసారిగా పబ్లిక్ గార్డెన్స్‌లో కలుసుకున్నారు.

ఇద్దరి గుండెలూ బరువుగా ఉన్నాయి.

లేని సంతోషాన్ని. ఉత్సాహాన్ని తెచ్చుకుని శ్రీధరే అన్నాడు.

"పల్లవీ ! నేను నిజంగా అదృష్టవంతుణ్ణి ! ఎందుకో తెలుసా ?—"

"చెప్పు శ్రీధర్ !"

"నేను కన్న కలలన్నీ నిజమై సజీవ రూపంలో నా ఎదుట నిలచాయి ఈనాడు. రిసెర్చి చేయాలనుకున్నాను. ఫారెన్‌లో రిసెర్చి చేసే అవకాశం లభించింది, మన స్నేహం వర్ధిల్లి దానికో శాశ్వత రూపం ఏర్పడాలని ఆశించాను. అదీ జరిగింది. ఇక జరగవలసింది ఒక్కటే. నేను తిరిగి వచ్చాక నీ మెడలో మూడు ముళ్ళు వేయడమే !" అని నవ్వాడు.

"ఏమో... నాకు భయంగా ఉంది" తప్త కంఠంతో అంది.

"ఎందుకు ?"

"నాకే తెలియదు. రెండు సంవత్సరాలు జరగాలి. ఈ రెండు సంవత్సరాలలో ఏమైనా జరగవచ్చు. నీకే ఆపదా రాకూడదని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ రోజులు గడుపుతాను" తన మాటల్లో తడబాటు, గుండెలో దడ.

శ్రీధర్ మెత్తగా నవ్వాడు.

"మనం ఎప్పుడూ ఆశావాదులంగానే ఉండాలి. నాకే ఆపదా కలగదు. ఎందుకంటే, పల్లవి అదృశ్య రూపంలో సదా నన్ను కాపాడుతూనే ఉంటుంది !"

"అవన్నీ పిచ్చిమాటలు ! అంత శక్తి నాకుంటే, ఇంతభయం ఎందుకు శ్రీధర్ ! అక్కడ ఆకర్షణలు జాస్తి..." మరో సందేహాన్ని మెల్లగా వెలిబుచ్చింది.

"ఆకర్షణలు ఇక్కడ లేవా ? ఈ హృదయ సామ్రాజ్యంలో పల్లవిదే ఏక ఛత్రాధిపత్యం ! మరో అమ్మాయి నీడ కూడా అక్కడ పడేందుకు వీల్లేదు. నీ భయాలన్నీ అర్థ రహితం. కేవలం నిరాధారాలు."

"నా స్థానంలో నువ్వుంటే ఈవిషయాన్నంత తేలిగ్గా తీసుకోవు!" నిష్ఠుర వేదనా స్వరంతో అంది.

"నీకున్న భయాలన్నీ నాకూ ఉండవచ్చుగా పల్లవీ!" అలవోకగా నవ్వుతూ అన్నాడు.

"శ్రీధర్ !" నివ్వెరపోతూ అంది.

"ఏం? ఎందుకంత గాబరాపడతావు! నేను నీకెంతో, నీవు నాకూ అంతేగా పల్లవీ! ఇంకా ఎక్కువేనేమో?"

"ఈ పల్లవి ఎప్పటికీ నీదే. తాళిబొట్టు కట్టలేదు. మనసా వాచా నీవేనాభర్త కావాలని కోరుకుంటున్నదానను. నీ బ్రతుకుతోనే నాబ్రతుకు ఇమిడివుంది. నీ మరణం మనిద్దరి మరణం. ఈ విషయం గుర్తుంచుకో. చివరి మాటలంటున్నప్పుడు తన గొంతు బాగా కంపించింది.

"నాకూ అంతే? నీనామం జపిస్తూ ఈ రెండు సంవత్సరాలు గడిపేస్తాను. తర్వాత రెక్కలు కట్టుకుని దేవిగారి సాన్నిధ్యంలో వాలిపోతాను."

"ఉత్తరాలు వ్రాస్తుండాలి వాటిలోనన్నా నిన్ను చూసుకుని ఊరట చెందుతాను"

"అలాగే!"

# స్వార్థం కోరిన బలి

తన చెయ్యితీసుకుని మృదువుగా ముద్దు పెట్టుకున్నాడు.

"అప్పుడే ఫారెన్ స్టైలా !" కన్నీటిగుండానే నవ్వుతూ అంది. కన్నీటితో వీడ్కోలు తీసుకున్నారిద్దరూ.

శ్రీధర్‌నుండి క్షేమంగా చేరినట్లు ఉత్తర మొచ్చాకగానీ, కంటినిండా, సుఖంగా నిద్ర పోలేక పోయింది. రెండువారాలకో ఉత్తరం వ్రాసేవాడు శ్రీధర్. రెండువారాల తర్వాత ఒకరోజు గడచినా ఏదో ఉపద్రవం జరిగినట్లు తల్లడిల్లి పోయేది తను.

శ్రీధర్ వెళ్ళిన ఆరునెలలవరకూ క్రమంగా రెండు వారాలకోసారి ఉత్తరాలు అందాయి.

తర్వాత ఒక ఉత్తరమూ రాలేదు.

తల్లడిల్లిపోయింది. కన్నీరు మున్నీరుగా ఏడ్చింది. ఉత్తరాలమీద ఉత్తరాలు వ్రాసింది. ప్రత్యుత్తరంలేదు. కుమిలిపోయింది.

ఆనాటినుండీ ఈనాటివరకూ ఏడుస్తూనే ఉంది.

నలుగురిలో తిరుగుతున్నా తనలోకం వేరుగానే ఉంటుంది.

ఏమైంది శ్రీధర్‌కు? తనను మరచాడా? అసలు సజీవంగా ఉన్నాడా? ఎలా తెలిసేది? ఎవరి నడిగేది?

అమ్మా నాన్నా తన మూగ వేదనను అర్థం చేసుకుని ఊరడించారు. ఆ సంవత్సరం ఏం చదవలేక పోయింది.

క్లాసు వస్తుందని అంతా అనుకున్నా. మామూలుగానే పాసయింది. రిజల్ట్సు తెలిసిన రెండు నెలలకు ఉమెన్సు కాలేజీలో డెమాన్‌స్ట్రేటర్‌గా ఉద్యోగం దొరికింది. ఇంట్లో కూర్చుని తనలో తను కుమిలిపోతుం దన్న ఉద్దేశంతో అతి ప్రయత్నం మీద ఉద్యోగంలో జాయిన్ చేయించారు నాన్న.

ఉద్యోగం చేస్తోంది.

కానీ, జీవితం మీద ఆసక్తి పోయింది. జీవచ్ఛవంలా బ్రతుకుతుంది. ఒక్కటే ఆశ తన ప్రాణాన్ని కాపాడుతుంది. ఏదో కారణంచేత ఆ కారణం ఫలానా అని తను చెప్పలేదు—శ్రీధర్ ఉత్తరాలు వ్రాయడంలేదు. రెండు సంవత్సరాల తర్వాత తప్పక వస్తాడు. తన దీర్ఘకాల నిరీక్షణ ఫలిస్తుంది.

అంతకూ మనసుండబట్టక నాన్నను వాళ్ళ పల్లెకు పంపింది. నాన్నకు వెళ్ళడం ఇష్టం లేకున్నా, తన బాధను చూసి కాదనలేక వెళ్లారు. శ్రీధర్ తండ్రి కన్నీటితో తమకూ ఉత్తరాలు రావడంలేదని చెప్పారట. నాన్న నిరాశతో తిరిగి వచ్చాడు.

పగలు నలుగురిలో తిరుగుతున్నా, రాత్రిళ్ళు కన్నీటితోనే గడచి పోతున్నాయి.

దసరా సెలవులిచ్చారు. అమ్మా నాన్నా తనకు మార్పంటూ తిరుపతికి తీసుకువచ్చారు. వాళ్ళ పిచ్చి వాళ్ళది.

హు...మార్పు! ఎందులో మార్పు? స్థలం మారినంత మాత్రాన తన ఆలోచనలు మారి పోతాయా! శ్రీధర్‌ను మరచిపోతుందా! ఏవో సంబంధాలు వస్తున్నాయి.

తనకు పెళ్ళిచేయాలని అమ్మా నాన్నా ప్రయత్నిస్తున్నారు. తనకు పెళ్ళి! శ్రీధర్ రాకుండా తనకు పెళ్ళెలా అవుతుంది! ఏమిటి వీళ్ళపిచ్చి? తనకు మతి భ్రమించింది అంటుంది అమ్మ. అతన్ని మరచి పొమ్మని చెప్తుంది. ఎంత సులభంగా చెప్పగలదు! ఏం మనుషులు వీళ్ళు? తన బాధ ఎవరి కర్థమౌతుంది: వెంకటేశ్వరా! నీకన్నా నబాధ అర్థమౌతుందా! నీ వన్నా నా శ్రీధర్ ఏమయ్యాడో చెప్పలేవా?

పల్లవి చెక్కిళ్ళమీద జల జలా నీరు జారింది. గుండెలో బాధాగ్ని శిఖలు రేగాయి.

ఎవరివో అడుగుల చప్పుడు కాగా తలత్రిప్పి చూసింది. ఆమెతల్లి, జయమ్మ.

గబగబా చెక్కిళ్ళు తుడుచుకుంది.

''పల్లవీ! నా మాట వినవు? నువ్వు బాధపడి మమ్మలను బాధ పెడుతున్నావు. ఇలా కుమిలి కృశించిపోయి ఏం సాధిస్తావు చెప్పు? నీమనసుకు కాస్త శాంతి లభిస్తుందని ఇక్కడకు వచ్చాము. కానీ..."

"శాంతి?" విషాదంగా నవ్వి అంది పల్లవి.

''నువ్వు పెళ్ళి చేసుకోమ్మా! మంచి సంబంధం చూశారు మీ నాన్న. అతను ఎమ్.ఎ. చదువుకున్నాడట. మనఇంటి దగ్గరున్న సబ్‌పోస్టాఫీసులో పోస్ట్‌మాస్టర్‌గా ఉంటున్నారట. పెద్దచదువు వుంది గనుక త్వరలో ప్రమోషన్ రావొచ్చట. కట్నం అక్కరలేదట" పల్లవి ముఖంలో బాధా వీచికలు ఉవ్వెత్తున లేచాయి.

"అమ్మా! శ్రీధర్ వచ్చాకే నా పెళ్ళి!" స్థిర కంఠంతో అంది.

"నీకు పిచ్చిపట్టింది. అతనెవరినో చేసుకునే ఉంటాడు. లేకుంటే, నువ్విన్ని ఉత్తరాలు వ్రాసినా అతనెందుకు సమాధానం వ్రాయడు!"

"అమ్మా...నీ మాటలు నేను నమ్మను. శ్రీధర్ అలాంటి వాడుకాదు. అతనే ఈ విషయం చెప్తేనే నమ్ముతాను."

"అతను వచ్చి నీకు చెప్తాడా? ఇవన్నీ పిచ్చి మాటలు కావు?" బరువుగా నవ్వుతూ అంది జయమ్మ.

అంతలో ఆమె తండ్రి అక్కడకు రావడంతో ఆ ప్రస్తావన అంతటితో ఆగిపోయింది.

మరి రెండు రోజుల తర్వాత పల్లవి వాళ్ళు హైదరాబాద్ వెళ్ళిపోయారు.

*

పల్లవి చేతిలో ఎర్రచారల అంచులున్న ఓ నీలం కవరుంది పల్లవి సోఫాలో పడి ఉంది ఆమెలో చైతన్య ముందో లేదో ఆమె తల్లిదండ్రులు తెలుసుకోలేక పోయారు.

"పల్లవీ: పల్లవీ! ఇలా చూడమ్మా!" చల్లని నీళ్ళు ముఖంమీద చిలకరిస్తూ ఆందోళనా, భయం నిండిన కంఠంతో పిలిచింది జయమ్మ.

పల్లవి కళ్ళెత్తి శూన్యదృక్కులతో తల్లి ముఖంలోకి చూసింది.


"నువ్వు కాఫీచేసి తీసుకురా, [illegible] నిక్కడ కూర్చుని ఉంటాను" అన్నాడు భార్యతో శేషగిరి.

జయమ్మ కళ్లొత్తుకుంటూ లోపలకు వెళ్ళింది.

శేషగిరి పల్లవి చేతిలోని ఉత్తరం తీసుకుని పోస్ట్ ముద్రలకేసి పరీక్షగా చూశాడు. తేదీ సరిగ్గా కనబడటం లేదుగానీ, "న్యూయార్క్" అని మటుకు బాగా కనిపిస్తుంది.

ఆ కవరునుండి నీలంరంగు టైప్‌చేసిన కాగితం తీసి మూడోసారి చదివాడు శేషగిరి.

శ్రీధర్‌కు న్యూయార్క్‌లోఉన్న స్నేహితుడు



జార్జి అనే అతను ఇంగ్లీషులో టైప్‌చేసి పోస్ట్ చేసిన ఉత్తరంఅది.

శ్రీధర్ కొన్నాళ్ళు జబ్బుగాఉండి మరణించాడని తెలిపాడు. తను చనిపోతే, తన డైరీలో ఉన్న పల్లవి అడ్రసుకు ఆ విషయం తెలుపుతూ ఉత్తరం వ్రాయమని తనను కోరడం వల్ల, అతని కోరిక ప్రకారం ఆ ఉత్తరం వ్రాసినట్లుకూడా అందులో పేర్కొన్నాడు.

గాఢంగా నిట్టూర్చి. జాబు మళ్ళీ కవరులో ఉంచేశాడు. కాఫీ తెచ్చి బలవంతంగా రెండు గుక్కలు త్రాగించగలిగింది, కూతురిచేత జయమ్మ.

పల్లవి తనగదికివెళ్ళి తలుపు వేసుకుంది,

ఏకాంతాన్ని కోరుకుంటుంది కాబోలునని భార్యాభర్త లిద్దరూ మౌనంగా ఉండిపోయారు. మధ్యాహ్నం ఓసారి తలుపుతీసి గ్లాసుతో నీళ్ళు తీసికెళ్ళింది. చీకటులు అలుముకున్న పల్లవి తలుపు తీయలేదు.

తలుపు తట్టారు, దబదబ బాదారు. లాభం లేకపోయింది. మురళి వచ్చాక ముగ్గురూ కలసి తలుపులు బలవంతంగా తీశారు.

సుఖంగా నిద్రపోతున్నట్లు పడుకునుంది పల్లవి.

సగం అయిపోగా, మిగిలిన ఎండ్రిన్‌పొట్లం వాళ్ళనుచూసి వెక్కిరించింది. కెవ్వుమని కేకేసి కుప్పగా కూలిపోయారు ముగ్గురూ.

పల్లవి మరణించిన పదిరోజులకు శ్రీధర్ స్నేహితుడు రవీంద్ర ఢిల్లీలో ఉద్యోగంచేస్తున్న తను శేషగిరి ఇల్లువెతుక్కుంటూ వచ్చాడు.

"నన్ను శ్రీధర్‌పంపాడు" అన్నాడు రవీంద్ర విషాదానికి మారోరూపంగాఉన్న శేషగిరి ముఖంలోకి వింతగా చూస్తూ.

"ఎందుకు పంపాడు? ఎప్పటి మాట?" అన్నాడు కాస్త ఆశ్చర్యంగా.

"శ్రీధర్ ఎన్నిఉత్తరాలు వ్రాసినా, ఒక్క ఉత్తరానికీ పల్లవిగారినుండి జవాబులేదట. "నేను పల్లవినెంతగా ప్రేమిస్తున్నానో నీకేం తెలుసు. నీవుహైద్ వెళ్ళిపల్లవిసంగతి తెలుసుకుని వ్రాయనిదే నేను స్తిమితంగా నాచదువు సాగించలేనని వ్రాశాడు. పదిరోజుల్లోకిందటే రావలసింది. కానీ,కొన్నిపనుల ఒత్తిడివల్ల రాలేకపోయాను" అన్నాడు. దుఃఖానికీ, ఆశ్చర్యానికి ప్రతినిధులే అయ్యారు జయమ్మా, శేషగిరీ ఇద్దరూ. పల్లవి మరణం విషయంచెప్పి భోరున ఏడ్చింది జయమ్మ. శేషగిరి ఉత్తరంతెచ్చి చూపించాడు.

రవీంద్ర తల గిర్రున తిరిగి నట్లయింది. పల్లవి మరణవార్త అతని హృదయాన్ని కలచివేసింది.

"నాలుగురోజుల్లోకిందటే "హైద్" వెళ్ళావా లేదా అని వ్రాసిన ఉత్తరం శ్రీధర్ అందుకున్నాను, బయలుదేరేముందు ఇక్కడకు వస్తున్నట్లు వాడికి ఉత్తరం వ్రాసివచ్చాను. ఇందులో ఏదోమోసం ఉంది. ఈ విషయం శ్రీధర్‌కెలా వ్రాసేది?" డగ్గుత్తికతో అన్నాడు రవీంద్ర.

"వద్దుబాబూ! ఈ విషయాలన్నీ వ్రాసి ఆ అబ్బాయి మనసు పాడుచేయకు. వచ్చాక తనే తెలుసుకుంటాడు." అన్నాడు బొంగురుగొంతుతో శేషగిరి.

"పల్లవిగారి విషయం ఏం వ్రాయను?" గొంతులో బాధ మెలికలుతిరిగి పోతుండగా అడిగాడు రవీంద్ర.

"పల్లవి బాగానే ఉందనీ, ఉత్తరాలెందుకనో అందలేదనివ్రాయి" అని ఉబికివచ్చిన కన్నీటిని తుడుచుకున్నాడు శేషగిరి.

భార హృదయంతో వెళ్ళిపోయాడు రవీంద్ర.

* * *

అసలు జరిగిన విషయం శ్రీధర్ తండ్రికి. అక్కడ సబ్ పోస్టాఫీసులో పోస్ట్ మాస్టరుగా పనిచేస్తున్న జయరాజ్‌కూ తప్ప మరో వ్యక్తికి తెలియదు.

జయరాజ్ శ్రీధర్ తండ్రి స్నేహితుని కుమారుడు. రెండు కుటుంబాలమధ్య మంచి స్నేహం ఉంది. రాకపోకలున్నాయి. శ్రీధర్‌కు వెళ్తున్న ఉత్తరాలను, పల్లవికి వస్తున్న ఉత్తరాలను గమనించాడు జయరాజ్. ఒకసారి శ్రీధర్ తండ్రిని కలుసుకున్నప్పుడు ఆ విషయం చెప్పాడు.

శ్రీధర్ తండ్రి నారాయణరావుకు, ఆ విషయం అశనిపాత సదృశమే అయింది. మనిషి పూర్తిగా తల్లక్రిందులై పోయాడు.

"ఇల్లా అవుతుందని అనుకోలేదోయ్ ! మా ప్లానులన్నీ వేరుగా ఉన్నాయి. శ్రీధర్ స్టేట్స్‌కు వెళ్ళగానే రాఘవయ్యగారొచ్చి వాళ్ళమ్మాయినిస్తానని సంబంధం స్థిరం చేసుకున్నారు. రాఘవయ్యగారి కున్నది ఒక్కతే కూతురు. లక్షలకు వారసురాలు. ఆడపిల్లలకు మంచి సంబంధాలు చేసి, మగపిల్లలకు పెద్ద చదువులు చెప్పిద్దామని కలలు కంటున్నాము. కానీ... రాజ్... విన్నెపుడూ ఏ సహాయమూ అడగలేదు. ఒక సాయం చెయ్యరా, బాబూ !" అన్నాడు దీనంగా.

"ఏం చేయమంటారు ?" అయోమయంగా ప్రశ్నించాడు.

"అటూ ఇటూ జాబులు వెళ్ళకుండా చేయి"

"అమ్మో ! నాకు మాట."

"అయితే. మేము బాగుపడడం నీ కిష్టం లేదన్నమాట!" "అలా అనకండి! డబ్బులేదన్న మాటేగానీ, పల్లవి చాలా మంచి అమ్మాయి. అందమైనది. ఆ వీధిలోనేగా నే నుంటున్నాను" అన్నాడు జయరాజ్.

"అయితే వాళ్ళూ మీ కులస్థులే. ఆ అమ్మాయిని నువ్వే చేసుకోరాదూ?"

"ఊహూ...ఆ అమ్మాయి శ్రీధర్‌నుతప్ప మరెవ్వరినీ చేసుకోదు" "అని నీ వనుకుంటున్నావు! ముందు ఉత్తరాలు వెళ్ళటం ఆపుచేయి. ఆ అమ్మాయితో నీ పెళ్ళి నేను జరిపిస్తాను." అంటూ హామీ ఇచ్చాడు.

జయరాజ్ మౌనంగా ఉండిపోయాడు. పల్లవి రూపం అతని కళ్ళముందు కదిలింది.

"చేతులుకాదు: కాళ్ళు పట్టుకున్నా ననుకో. ఏదో బాగుపడనున్నా గదాఅని సంతోషిస్తున్నాను నువ్వు కాదనకు బాబూ! ఇది నీ చేతిలోపనే! కొన్నాళ్ళు ఉత్తరాలు వెళ్ళకుంటే ఒకరి నొకరు మరచిపోతారు., అది సహజం. నీకు ఏమాటా రాకుండా కాపాడే బాధ్యత నాది" అన్నాడు జయరాజ్ చేతులు పట్టుకుని.

తన చేతిలోని పనిని జయరాజ్ చేశాడు.

సంవత్సరం తర్వాత ఇద్దరూ ప్లాను వేసి శ్రీధర్ మరణవార్తను పల్లవికి అందజేశారు !

కానీ,జయరాజ్ అనుకున్నది ఒకటి; జరిగింది మరొకటి. పశ్చాత్తాపంతో కుమిలిపోతున్న జయరాజ్ శ్రీధర్ ఇండియాకు రాగానే అసలు విషయం కన్నీటితోచెప్పి "ఇలా అవుతుందని అనుకోలేదు. నన్ను క్షమించు శ్రీధర్ !" అన్నాడు.

తండ్రిమీద! బంధువులమీద చెప్పలేనంత అసహ్యం కలిగింది శ్రీధర్‌కు. దగ్గర దగ్గర సంవత్సరం పాటు పిచ్చివాడిలా తిరిగాడు. మాట పోయినట్టు మూగవాడై పోయాడు.

తర్వాత ఎవ్వరికీ చెప్పకుండా నాగపూర్ యూనివర్శిటీలో ఉద్యోగం దొరికితే వెళ్ళిపోయాడు. పాఠం చెప్పడం తప్పిస్తే అతనికి లోకంతో పనిలేదు. పిచ్చి మాష్టరన్న బిరుదాన్ని చాలా త్వరగానే సంపాదించుకుని, నాగపూర్ లోనే స్థిరపడిపోయాడు. ! ★



డిజైన్

చిత్రం : ఆర్. డి. రమేష్‌చందర్, నిజామాబాద్